మందుకు పోయేది, వాటికి నీళ్లు పోసి పెంచారనుకున్నారా ఏవిటి? నే పాటలుపాడి కబుర్లుచెప్పి వాటిని సాకాను. ఎవరైతే మటుకు దొడ్డంతా గచ్చు చేయగల్రుగాని నా మనసులోని జ్ఞాపకాలను సిమెంటుపోసి గచ్చు చేయలేరు గదా! అసందర్భపు మనుషులింట్లో వున్నప్పుడు అటువంటి మమకారాలను ఇక ముందెన్నడూ పెట్టుకోదల్చుకోలేదు. ఎవరింట్లో పూస్తేనేం- అని నేను పెంచిన గులాబీ, సన్నజాజి మల్లె మాలతులు కదా! ప్చ్!

# టెల్గుమేనర్స్...కష్టమ్స్

శ్రీ కృష్ణ పరబ్రహ్మణే నమః అన్నా, మాదా కబళం తల్లీ అన్నా ఒహటే అర్థం. రమా రమణ గోవిందో హరి అన్నా, ఇందిరా రమణ గోవిందోహరి అన్నా సేమ్మీనింగు. సూరదాస్‌కో ఏక్ పైసా దేదో అంటాడు ఉత్తర హిందూస్థాన్‌లో కళ్లు లేని కబోది. శ్రీరామచంద్ర పరబ్రహ్మణేనమః అమ్మా ఉపాదానం తల్లీ అంటాడు యాయవారపు బ్రామిన్. యాచక వృత్తి అంటే అడుక్కోవటమైనా దానికొక డిగ్నిటీ ఎటికేట్ వుంది. నువ్వింత తిను నాకింత పెట్టు అనేదే భారతీయ కల్చర్.

గాడ్ గివజ్ అవర్ డైలీ బ్రెడ్. అన్నంత శుద్ధ వైదీకంగా తెలుగువాడే కాదు, ఏ ఇండియనూ ఎవణ్ణీ అడగడు. బెగ్గింగ్‌కి మన కంట్రీలో సోషల్ అండ్ రిలిజియస్ శాంక్షను వుంది గనుకే రైలుపెట్టెలలోను ఫ్లాటు ఫారములపైన, బస్సు స్టాండులోను యాచకులను ప్రోత్సహించవద్దు అని బోర్డులు కట్టినా పోలీసుల్ని పెట్టి తరిమినా మనం యాచక్స్‌ని ప్రోత్సహించకుండా వుండలేము. పదిమందికింత పెట్టి నువ్వు తిను అన్న థీరీ మన నర నరమ్సులో జీర్ణించిపోయివుంది.

అన్నపూర్ణా భవతీ భిక్షాందేహీ అని ఆది శంకరుడే కాదు. మన వీధుల్లో ముష్టి వాళ్ళు కూడా ఇల్లాళ్లను అన్నపూర్ణమ్మ తల్లీ అని సంభోధిస్తారు. దానం చేయటమంటే భగవదర్పితం శ్రీ కృష్ణార్పణమస్తు అనే సెంటిమెంట్ చాలా బలమైనది. నారాయణ స్వరూపుడైన భగవంతుని దరిద్రనారాయణులలో చూడమని వారికి సంతోషం కలిగిస్తే సర్వాంతర్యామి సంతృప్తుడవుతాడని మనవాళ్ళు నమ్ముతారు. ఆల్‌మెన్ ఆర్ ఈక్వల్ అన్నా సర్వం జగన్నాథం అన్నా ఒహటే గదా!

ముష్టెత్తుకోడానికి ఫ్రీడం వుందికాని ముద్దెట్టుకోడానికి మనకి ఫ్రీడం లేదు. బాహాటంగా లవ్ మేకింగ్‌కి సోషల్ అండ్ రిలిజియస్ శాంక్షన్ లేదు. సినిమావారు ఓపెన్ ఎయిర్ శృంగారం చూపిస్తారంటే అది మనీ మేకింగ్ కాని లవ్-మేకింగ్ కాదు.

ముష్టెత్తుకోడం విషయంలో ఎంతో మేనర్స్ కల మన భారతీయ కల్చర్ యిప్పుడిప్పుడు మన వారికి బోధపడకుండా అయోమయమైపోతోంది, ఇంగ్లీషు మర్యాదలే మర్యాదలని మనకు

బొత్తిగా మేనర్స్ లేవని మన అంకుల్స్ అండ్ కజిన్స్, మన మేనత్త కొడుకులూ మన మేనత్త మొగుళ్ళూ ఎట్సెట్రా గోలపెడ్తూ వుంటారు.

మనం సింపుల్‌గా నమస్కారమండీ అంటామా, అవతలవారు అంత కంటె సింపుల్‌గా చిరంజీవ అంటాడు. గాడ్‌సేవ్ దికింగ్ అనరు. నావిష్ణుః పృథివీపతి అంటారు మన వాళ్లు. ఇప్పుడిప్పుడు గుడ్‌మార్నింగ్ సార్ అంటున్నారు నిజంగా అవతలివాడికది గుడ్‌మార్నింగ్ అయినా కాకపోయినా.... మన నమస్కారం ముందు నిజంగా వాళ్ళ గుడ్‌మార్నింగ్ ఎందుకూ పనికిరాదు.

ఆ మాటకొస్తే ఇంగ్లీషు మర్యాదల కంటె తెలుగు మర్యాదలు పోనీ భారతీయ మర్యాదలు చాలా బెటర్ అంటాన్నేను ఆలోచిస్తే.

ఎవరైనా మనింటికొచ్చి వెళ్ళిపోయేప్పుడు "వస్తాను" "ఇక వుంటాను" అని కూడా అంటారు, మన పురుష పుంగవులు కూడా "వస్తాను తలుపేసుకో ధనలక్ష్మీ" అంటారు. వస్తాను, వుంటాను అంటే రాను, వుండను ఇక వెళ్తాను అని అర్థం. వచ్చినవారు వెళ్తాను అని అనకూడదు. వచ్చిన వారిని పొమ్మని మనం చెప్పకూడదు. ఇవి తెలుగు మర్యాదలు. ఇంగ్లీషు పద్ధతులమాదిరి గుడ్‌నైట్ గుడ్‌బై అని చెప్పం, చెప్పకూడదు. అలా చెప్పవలసివస్తే రాం రాం అన్నమాట. రాం రాంభయ్యా అంటే జరగకూడని దేదో జరిగిపోయిందని అర్థం. శ్రీకృష్ణ యదుభూషణా, అరి నీతస్సలమందూ అని కూడా అంటాం. ఏదైన జరగకూడని అవాంతరం వచ్చినప్పుడు రామ రామ, శివ శివ, హరి హరీ" అని కూడా అంటాము. "అయ్యో అయ్యో" అన్నా "నారాయణ నారాయణ" అన్నా ఒకటే ఫీలింగూ ఒకటే అర్థమూ.

మనకి పూర్వం జాతీయగీతాలంటూ లేవు కనుక నిశ్శబ్దంగా చేతులుకట్టుకుని నిలబడటం. జాతీయ జండాకు వందనం చేయటం. భోజనకాలే గోవిందనామస్మరణ గోవిందా గోవిందా అన్నంత ఈజీగా పట్టుబడలేదు. మనకి మంగళహారతులు అలవాటైనట్లు నేషనల్ ఆన్‌థెమ్ కాని జాతీయగీతాలు కాని అలవాటుకాలేదు. మంగళహారతి పళ్ళెం అని మంగళహారతి పాడినందుకు ఫీజుకూడా వసూలుచేస్తున్నాం. ఒకప్పుడిది ఫైవ్స్‌టెన్‌ల నుండి హండ్రెడ్స్ థవుజండ్స్ వరకూ వుంటుంది.

"పరబ్రహ్మ పరమేశ్వర" అని పాడకుండా మన వాళ్లు ఎంత ప్రొగ్రెసివ్ నాటకమైనా తెర ఎత్తరు. కొబ్బరికాయ కొట్టాల్సిందే మంగళ హారతి పాడాల్సిందే – పెళ్లిళ్లలో అయిటం అయిటంకి మధ్య మంగళ హారతి యిస్తూ వుంటారు. గుమ్మాలదగ్గర, పీటలమీద కూర్చొపెట్టినప్పుడు మంగళహారతి పట్టుకురండర్రా అని కేకలు వేస్తుంటారు. ఒక్క మంగళహారతి కూడా రాని ఆడపిల్లలు నేడు థవుజండ్స్‌లో వున్నారు స్కూళ్ల లోనూ కాలేజీల్లోనూ, మంగళహారతి పాడ్డానికి స్టేటస్ అంటే ఆడబడుచో చెల్లో అక్కో అయివుండటం అవసరంగాని సంగీతం వచ్చివుండటం గొంతుక బాగుండటం అట్టే అవసరంలేదు.

"రామచంద్రాయ జనకరాజాయ మనోహరాయ మామకాభీష్టదాయ మహిత మంగళం" అని మునుపు ఎవరినోటంట విన్నా వినిపించేది. గౌరి నోములప్పుడు కాబోలు మంగళహారతితో అంబ సావిత్రీ నీకూ అని కీచు గొంతుకలతో మేమంతా పాడేవాళ్ళం. అప్పుడప్పుడు స్త్రీల కార్యక్రమాల్లో రేడియోలో కమ్మగా వినదగ్గది పొదుపు ఉద్యమం, ఫామిలీ ప్లానింగ్ ప్రచారం కాదు ఆఖర్నో ఎప్పుడో పాడివినిపించే ఒక్క మంగళహారతి మాత్రమే. ఏదైనా అయిపోయిందనిపించేయటానికి మంగళ హారతి పాడించారని అంటారు. జనగణమన అన్నా మంగళహారతి అన్నా ఒకటే పర్పస్‌కి పనిచేస్తాయి. హరికథలూ, పాటకచ్చేరీలు, భజనలప్పుడు పవమాన సుతునిబట్టు పాదారవిందములకు...నీ నామ రూపములకు నిత్య జయమంగళం – ప్రహ్లాద నారదాది" అనగానే అంతా ఒక్కమాటు లేచిపోయి గిరగిర గిర ప్రదక్షిణాలు చేసేవారు.

ఇప్పుడు వీటిస్థానం ఆక్రమించటానికి ఏ పాటలూ పనికిరావు. ఈ కస్టమ్స్ యీ మర్యాదలు మన జీవితానికి మంచి ఫినిష్ నిచ్చాయి. ఎంత పచ్చి మార్క్సిస్టయినా పొరపాటున హరి కథ పందిట్లో కూర్చుంటే "పవమాన సుతుడు బట్టు" అనగానే ఠక్కున లేచి నిల్చుంటాడు. అది త్యాగయ్యగారి ప్రభావం. "చరణములే నమ్మితి నీదివ్య" కాని, పాడుతూంటే ఎంజాయి చెయ్యటానికి తెలుగువాడికి కారల్ మార్క్స్ కాని ఏంగెల్సు కాని స్టాలిన్‌కాని, మావోకాని అడ్డురాలేరు. రామదాసు, త్యాగయ్య, కబీరు వీళ్లని తల్చుగుంటూంటే "అహ్హో ఎందరో మహానుభావు లందరికీ వందనములు" అనిపిస్తుంది దట్సాల్!

# హర్ హైనస్

మేచ్‌బాక్స్ మేనత్త అని మాకొహావిడుండేది. అంటే ఆవిడ మేచ్‌బాక్స్‌లో పట్టేదని కాదు అర్థం. ఆవిడ అగ్గిపెట్టె వాడకాన్ని గురించి ఒక పెద్ద థీరీ ప్రవేశపెట్టింది. బైదిబై అగ్గిపెట్టిలో ఎన్ని పుల్లలుంటాయి? ఎన్నో కొన్ని ఎవరూ లెక్కపెట్టరనుకోండి. కాని ఆవిడ ఏడాదికి డజను అగ్గిపెట్లు తెప్పించేదిట. పుల్లలన్నీ లెక్కపెట్టి పెట్టికి యాభయ్యో ఎన్నో సమంగా సర్దివుంచేది. రోజుకో పుల్లచొప్పున నెలకు ముప్ఫై ఫిబ్రవరి అయితే ఇరవై ఎనిమిది పుల్లల్నే వాడేది. కొంచెం తుక్కు, ఓ పిడకముక్క తీసుకుని దాలిముట్టించి అందుమీద పొలచట్టిని ఎక్కిస్తే అందు లోంచే ఓ పడికముక్క పట్టిగెల్లి మరోందుకు మరోందుకు పొయ్యి రాజెయ్యాల్సిందేకాని మళ్ళీ ఛస్తే అగ్గిపుల్ల గీయటానికి రూల్లేదు, వీల్లేదు.

సామానుకొట్లో ఒక బుడ్డిదీపం వుండేది. ఆ గదిలో అసలు గాలే వుండదు కనుక ఆ దీపం చిమ్నీ లేకపోయినా ఆరకుండా వెలిగేది. మావిడి టెంకల్ని ఎండబెట్టి ఆవిడ కిచెన్ ఫ్యూ